

ఆ రోజు ఆదివారం సాయంత్రం నాలుగు గంటల సమయం ఆఫీసర్ రాజశేఖరం తన బంగళాలో మేడమీద ఆరుబయట కూర్చుని ఫైళ్ళు చూస్తున్నాడు దఫేదారు రమణయ్య 'పక్కన నిల్చుని ఫైళ్ళు అందిస్తున్నాడు తన పనికి అంతరాయం కలిగిస్తూ అడుగుల చప్పుడు కావడంతో అటు తిరిగి చూచాడు రాజశేఖరం. ఎదురుగా ఓ పాతిక సంవత్సరాల యువతి నిల్చుని వుంది రాజశేఖరం దృష్టి తన మీద పడగానే ఆమె వినమ్రతతో నమస్కరించింది

"ఎవరూ?" అడిగాడు రాజశేఖరం హుందాగా చూస్తూ

"మన డ్రైవర్ జోగినాథం భార్య సార్" చెప్పాడు రమణయ్య

తన కింద పనిచేసే డ్రైవర్‌కు ఇంత అందమైన భార్య వుండడమా? మనసులోనే ఈర్ష్య చెందాడు రాజశేఖరం

'ఏం కావాలి?' తన భావాలను అణచుకుంటూ అడిగాడు

'మా వారు జ్వరంతో పడుకొని వున్నారు అయ్యగారిప్పుడెక్కడికో వెళ్లాలని జీపు సిద్ధం చెయ్యమన్నారట రాలేనని చెప్పి రమ్మన్నారు" మెల్లగా చెప్పిందామె

"ఫర్వాలేదులే నేనే జీపు తీసుకెళ్ళగలను.' తన మంచితనం ప్రదర్శించుకొన్నాడు రాజశేఖరం

ఆమె మళ్ళీ నమస్కారం చేసి వెళ్ళిపోయింది

రాజశేఖరం ఫైలు తెరిచాడు చారడేసి కళ్ళతో, బారెడు వాలు జడతో, సన్నని నడుముతో, ఎత్తైన విగ్రహంతో, చిత్రకారుడు అతి పొందికగా గీచిన చిత్రంలా ఆ యువతి రూపం కాగితాలమీద కనిపిస్తుంటే, బ్రహ్మచారి రాజశేఖరానికి ఫైలులోని అక్షరాలు కనిపించడంలేదు చాలాసేపు ఫైలు అలాగే వుంచుకుని , కళ్ళ ముందు మెదులుతున్న ఆ మూర్తిని స్మరించుకుంటున్నాడు రాజశేఖరం

ఆ క్షణం నుండి అతనిలో పైత్యం ప్రకోపించింది

'రమణయ్యా! జోగినాధానికి పిల్లలెందరూ?" మెల్లగా అడిగాడు రాజశేఖరం

"ఒక అబ్బాయి సార్" బదులిచ్చాడు రమణయ్య

ఆ రాత్రి రాజశేఖరానికి చాలా భారంగా గడిచింది మరు రోజు ఉదయం నిద్ర లేస్తుండగానే కిటికి నుండి జోగినాధం క్వార్టర్స్ కేసి చూచాడు నడుముకు పమిట బిగించి, కల్లాపు చల్లుతూ కనిపించిందామె ఆమె పేరు నిర్మల.

"ఎంత ముగ్ధ మనోహర రూపం?" తనలో తాననుకొన్నాడు రాజశేఖరం

ఆమెను ఆమెనొక్కసారయినా పొందకపోతే తన జీవితం వ్యర్థం అనుకొన్నాడు పైగా ఆఫీసరంతటివాడు అడిగితే కాదంటుందా?"

కిటికీ వద్ద చేరి దీర్ఘాలోచనలో పడిపోయాడు

"ఏమిటన్నయ్యా? అంత దీర్ఘాలోచనలో పడిపోయావు?" వెనకనుండి చెల్లెలు సౌజన్య పల్కరించే వరకు ఈ లోకంలోకి రాలేకపోయాడు రాజశేఖరం.

ఏం లేదమ్మా" అని జరజర బాత్ రూమ్ వైపు నడిచాడు

ఆ రోజు నుండి ప్రతి ఉదయం నిద్రలేవగానే, కిటికీ నుండి నిర్మలను చూడడంతో ప్రారంభిస్తున్నాడు తనదినచర్య రోజులు గడిచేకొద్ది రాజశేఖరంలో కాంక్ష ఎక్కువైంది

ఒక రోజు పకడ్‌బందీ అయిన ఏర్పాటు చేసుకున్నాడు రాజశేఖరం రోజూ సాయంత్రం వేళలందు చెల్లెలు సౌజన్యను జీపులో ట్యూషనుకు తీసుకెడతాడు జోగినాథం ఆమె ట్యూషన్ పూర్తయ్యేవరకు అక్కడ వుండి, ఆమెను తిరిగి తీసుకొస్తుంటాడు, ఆనవాయితీ ప్రకారం ఆ రోజు కూడా జోగినాదం జీపులోనే సౌజన్యను ట్యూషన్‌కు తీసుకెళ్లాడు దఫేదారు రమణయ్యను ఇంటికెళ్ళమని పర్మిషన్ ఇచ్చేశాడు ఇప్పుడు బంగళాలో రాజశేఖరం ఒక్కడే వున్నాడు ఇదే మంచి అవకాశం అనిపించింది రాజశేఖరానికి డాబా మీది తన పడకగది కిటికీ నుండి జోగినాథం క్వార్టర్సుకేసి చూశాడు ఆరుబయట చాపమీద కూర్చుని మల్లెపూలు అల్లుకుంటోంది నిర్మల

'ఏమండీ?' ధైర్యం చేసి పిలిచాడు.

ఆమె కిటికీ వైపు చూచింది రాజశేఖరం కళ్లలోని మెరుపును చూచి, తొట్రుపాటుతో పైకి లేచి నిల్చుంది

ఒక్కసారిలా వస్తారా?' అడిగాడు రాజశేఖరం

ఆమె చేతిలోని పూల చెండు చాపమీద విడిచి బయలుదేరింది

ఆమె పైకి రావడం, కొయ్య మెట్లమీద టకటక శబ్దం చేస్తుంది ఆ అడుగుల చప్పుడు రాజశేఖరం గుండెలలో ప్రతిధ్వనిస్తుంది

పిలిచారా సార్" ఆమె ఎదురుగా నిల్చుని అడిగింది

అవును నీతో కొంచెం పని వుంది నీవు కాదనవద్దు నీ అందం నన్ను పిచ్చివాడిని చేస్తుంది ఒక్కసారి నాకు పొందు కావాలి కాదనకు ' చెప్పదల్చుకున్నది స్పష్టంగా సూటిగా చెప్పాడు రాజశేఖరం

'బాబుగారూ!' ఆమె ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేసింది అతనలా అడుగుతాడని ఆమె వూహించలేదు

'నేను తప్పు చేస్తున్నానని నాకు తెలుసు కానీ తప్పదు. నేనీ మనోవ్యాకులత భరించలేను ఒక్కసారి ఒకే ఒక్కసారి నన్ను కరుణించు " రాజశేఖరం అడిగాడు


అతనొక ఉన్నతోద్యోగి అనే స్పృహ కోల్పోయాడా క్షణంలో ఆకలిగొన్నవాడు, వాకిట ముందు చేరి అర్థించినట్లు అడిగాడు

నిర్మల మౌనంగా తల వంచుకుంది

చూడు! నీవంగికరించకుంటే నీ భర్తను దూరంగా ట్రాన్స్‌ఫర్ చేస్తాను"' రెండవ అస్త్రం' ప్రయోగించాడు రాజశేఖరం

ఆమెలో కదలిక లేదు.

'కాల యాపన చేయకు నిన్ను బలవంతంగా అనుభవించడం నాకిష్టంలేదు నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాను నీవేది కోరినా తీరుస్తాను . " అర్థించాడు



అప్పటికీ ఆమె మాట్లాడలేదు

"మౌనం అంగికారానికి సూచన అని భావించ మంటావా? అంటూ ముందుకు నడిచాడు రాజశేఖరం అతనిలోని ఉద్వేగాన్ని అణుచు కోలేకున్నాడు

ఆమె గుండెలు దడ దడలాడాయి భూమి క్రుంగిపోతే బాగుణ్ణనిపించింది అతను ఆమెకు దగ్గరగా, అతి దగ్గరగా వచ్చేశాడు. తనేం చెయ్యాలి? వెను తిరిగి మెట్లు దిగి పరుగెడితే ! కానీ ఆమె కదలలేకపోతూంది. బయంతో మొద్దుబారి పోయింది

అతని చెయ్యి ఆమె భుజంమీద పడడానికి కొన్ని సెకెండ్ల వ్యవధిలో బంగళా కాంపౌండులోకి ప్రవేశిస్తూ జీపు హారన్ వినిపించింది

నిర్మలకు ఆ హారన్ విష్ణుమూర్తి శంఖారావంలా అనిపించింది రాజశేఖరానికి సింహగర్జనలా తోచింది ఉవ్వెత్తున లేచిన కెరటం చప్పున అణగారిపోయింది

'నీవు త్వరగా ఇక్కడినుండి వెళ్ళు' గాబరా నణుచుకుంటూ అన్నాడు రాజశేఖరం

నిర్మల ఒక్క పరుగున కిందకు దిగి వెళ్ళిపోయింది

తొట్రుపాటును, అలజడిని అణుచుకుంటూ మంచంమీద బొక్కబోర్లా పడుకొన్నాడు రాజశేఖరం.

కొంత తడవుకు ఎవరో మెట్లెక్కుతున్న చప్పుడు మరికొంత సేపటికి ద్వారం ముందు నిల్చున్న అలికిడి

'రాస్కెల్స్' చదువుకోగానేసరా? బుద్ధి జ్ఞానం వుండద్దూ ఆడదాన్ని చూస్తే ఒళ్ళు అంత తిమ్మిరెక్కుతుంది కాబోలు ' కోపంతో వూగిపోతున్న జోగినాథం గొంతు అది

రాజశేఖరం పై ప్రాణాలు పైనే పోయాయి వీడింత అర్థాంతరంగా వస్తాడనుకోలేదు ఇప్పుడు తన పరువేంగాను? తన హోదా ఎక్కడ, తను తెచ్చుకున్న అప్రదిష్ట ఎక్కడ?? ఛీ ఛీ క్షణికావేశం' తనను తాను నిందించుకున్నాడు

'సార్!' జోగినాథం గొంతు స్థాయి పెరిగింది

ఇక తప్పదన్నట్లు పైకి వేచి, ప్రశ్నార్థకంగా డ్రైవర్‌కేసి చూచాడు రాజశేఖరం అతని కళ్ళు చింతనిప్పుల్లా వున్నాయి

మీరొచ్చి ఆమెను సముదాయించాలి జోగినాథం డిమాండ్ చేశాడు

ఎవర్ని! రాజశేఖరం గొంతు తడబడింది

'అమ్మాయిగార్ని

జోగినాథం జవాబుకు మంచంమీద నుండి ఎగిరి గంతేసినట్లు లేచాడు రాజశేఖరం

ఏమైంది?

"వాడు ఆ ట్యూటర్ ఎవరూ లేకుండాచూచి, అమ్మాయిగారి మీద చెయ్యేసేదట ఆమె భయంతో గావు కేక వేసింది నేను లోపలికి వెళ్ళి చూస్తే వాడు ఆ రాస్కెల్.. అమ్మాయిగార్ని బలవంతంగా తన కౌగిలిలోకి తీసుకుంటున్నాడు వాడి మెడమీద రెండిచ్చి అమ్మాయిగార్ని ఇంటికి తీసుకొచ్చేశాను వాడిమీద కేసు పెట్టాలి పోలీసులకు ఫోను చెయ్యండి ముందు అమ్మాయిగార్ని సముదాయించండి." గుక్క తిప్పుకోకుండా చెప్పాడు జోగినాథం

రాజశేఖరం పరుగున మెట్లు దిగి, సౌజన్య గది వైపు నడిచాడు సౌజన్య ఏడుస్తూ, దిండులో. తలదూర్చికొని వుంది ట్యూటర్‌మీద పళ్ళు కొరకబోయాడు కానీ నాలుక కసుక్కున కొరుక్కున్నాడు

తన చెల్లెలు మానం జోగినాథం కాపాడాడు గానీ, తను తను! అతని భార్య మానాన్ని దోచెయ్యాలని చూచాడు ట్యూటర్‌లాగే తనూ నేరస్తుడే

ఏం చెప్పాలో, ఎలా సమాధానపర్చాలో తెలియక మౌనంగా సౌజన్య భుజం తట్టి, బుజ్జగించి, లేచి వచ్చేశాడు రాజశేఖరం అతని ప్రవర్తన వింతగా తోచింది జోగినాథానికి

ఆ తరువాత రాజశేఖరం మరెప్పుడూ కిటికీ నుండి డ్రైవర్ క్వార్టర్స్‌కేసి చూడలేదు. □

